# Andhra Jyothi

# ఏపీపీఎస్సీ కుప్పిగంతులు

- గ్రూప్-2 ఇంటర్వ్యూకు 54 మందికే అర్హత
- తొలుత 317 మందితో వెబ్‌సైట్లో జాబితా
- పరిశీలన తర్వాత 263 మంది తొలగింపు
- అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపం
- ఆందోళనలో వందలాది మంది అభ్యర్థులు

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల పాలిట ఆశాదీపం అయిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) కుప్పిగంతులు వేస్తోంది. తప్పులతడకగా జాబితాలను తయారు చేస్తూ.. అనర్హులకు అర్హత కల్పిస్తూ నిరుద్యోగ లోకాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. అస్పష్టతకు తెరదించే ప్రయత్నంలో మరిన్ని పొరపాట్లు చేస్తోంది. 1999 నాటి గ్రూప్-2 ఇంటర్వ్యూలకు 54 మంది కొత్త అభ్యర్థులకే అర్హత లభించిందని ఏపీపీఎస్సీ సోమవారం ప్రకటించింది. తొలుత మొత్తం 317 మందికి అర్హత ఉందని తేల్చి.. శనివారం రాత్రి వారి జాబితాను వెబ్‌సైట్లో పెట్టింది. ఈ జాబితాలోని అభ్యర్థుల అర్హతపై పెద్దఎత్తున అభ్యంతరాలు వచ్చాయి. దీంతో జాబితాను తొలగించింది. ఆది, సోమవారాల్లో నిశిత పరిశీలన చేసి.. వడపోతల అనంతరం జాబితా నుంచి 263 మందిని తొలగించింది. వీరంతా గతంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన, గైర్హాజరైన, అనర్హులైన వారే కావడం గమనార్హం. ఈ పరిణామంతో ఏపీపీఎస్సీ సిబ్బంది నిర్వాకం మరోసారి బయటపడింది. డేటాబేస్‌లో సమస్య తలెత్తడం, ఒరిజినల్ అప్లికేషన్స్ ఎక్కడో ఉండటం వల్లనే ఈ పొరపాటు జరిగిందని కమిషన్ వర్గాలు సమర్థించుకుంటున్నప్పటికీ కొంత మంది బాధ్యతారాహిత్యం మాత్రం ప్రస్ఫుటమవుతోంది.

1999 నాటి గ్రూప్-2 సర్వీసెస్ నోటిఫికేషన్ ద్వారా.. 104 పోస్టులు .. 973 పోస్టులు .. 111 పోస్టులు ఖరారు చేస్తూ.. 1188 ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నిర్ణయం తీసుకుంది. అయితే తొలి 104 పోస్టుల భర్తీకి అంతరాయం కలగలేదు. అదే సంవత్సరం నవంబరు 15న జారీచేసిన జీ.వో.నెం. 763 లో ప్రభుత్వం సెలక్షన్ విధానాన్ని పేర్కొంది. జిల్లా స్థాయి పోస్టులను 80:20, రాష్ట్రస్థాయి పోస్టులను 70:30, 60:40 నిష్పత్తిలో భర్తీ చేయాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగానే 104 పోస్టులను భర్తీ చేశారు. అయితే 2002 మార్చి 7న విడుదల చేసిన జీ.వో.నెం.124 ప్రకార ం.. 973 పోస్టులకు, 111 పోస్టులకు కలిపి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం.. లోకల్, నాన్‌లోకల్‌లో కలిపి అంటే ఓపెన్ మెరిట్‌లో తొలుత ఎంపికలు చేపట్టి.. తర్వాత లోకల్ పోస్టులకు సెలక్షన్ నిర్వహించాలి. ఈ విధానంపై కొందరు న్యాయస్థానంలో సవాల్ చేశారు. దీంతో రిక్రూట్‌మెంట్ నిలిచిపోయింది. కానీ ఈ జీవో గ్రూప్-2 నోటిఫికేషన్ 1999లో రావడం, అప్పటికి జీ.వో.నెం.124 లేకపోవడంతో పాత విధానాన్నే కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అంటే 104 పోస్టులకు అనుసరించిన పద్ధతి ప్రకారమే 973, 111 పోస్టులను కూడా భర్తీచేయాల్సి ఉంటుంది. అయితే గతంలో ఇంటర్వ్యూలకు హాజరైన, గైర్హాజరైన, అనర్హులైన అభ్యర్థులను కూడా ఇప్పుడు మళ్లీ ఇంటర్వ్యూల జాబితాలో చేర్చడంతో గందరగోళం తలెత్తింది. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయలోపం కనిపిస్తోంది.

**19-20 తేదీల్లో ఇంటర్వ్యూలు:** గ్రూప్-2 సర్వీసెస్ ఇంటర్వ్యూలు అక్టోబర్ 19-20 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ సెక్రటరీ సాయి తెలిపారు. పొరపాటు సవరించామని, అన్ని వడపోతల అనంతరం 54 మందికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు.

కాగా ఏపీపీఎస్సీ బోర్డు సమావేశం మంగళవారం జరగనుంది. ప్రభుత్వం నియమించిన కొత్త సభ్యులందరూ పాల్గొంటారు. ప్రధానంగా కొత్త నోటిఫికేషన్లపై చర్చిస్తారు. గ్రూప్-3, గ్రూప్-2, ఏఈ, పలు చిన్న నోటిఫికేషన్లపై ఓ నిర్ణయం తీసుకుని ప్రకటించనున్నారు.